బుచ్చిబాబు' లాంటి సీతాపతికి ఒకానొక, ముహూర్తంలో హఠాత్తుగా జ్ఞానోదయమయింది. పెళ్ళయింది మొదలు ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు తను 'వరం' అనే వరలక్ష్మి చేతిలో కీలుబొమ్మఅయి ఎలా ఆడుతున్నదీ తలచుకుంటే అతనికి ఒళ్ళంతా కారం రాసుకున్నట్లుగా ఉంది.

'ఛ! ఆరడుగుల ఎత్తు మగవాణ్ణి ఒక ఆడ కూతురికిదాసుణ్ణయిపోవటమా? వీల్లేదు. ఇవాల్టితో ఇది ఆఖరు. ఈ వరం ఆట కట్టించాలి.'అనుకున్నాడు అందుకేం చేయాలి? అని సీరియస్‌గా ఆలోచించాడు.

ఎలా గయినా ఒక టేప్ రికార్డర్ కొనుక్కోవాలి అన్నది సీతాపతి చిరకాల వాంఛ. అది తీరని కోరికగా మిగిలిపోయింది ఇప్పటివరకూ.

పెళ్ళయిన నాటి నుంచి ప్రయత్నిస్తే భార్య వరలక్ష్మి బిడ్డతల్లి అయిన ఆయిదేళ్ళకి ఒక ప్రైవేటు కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది. ఇన్నాళ్ళు ఎలాగా ఒకరి సంపాదనలోనే నెట్టుకుంటున్నాం కదా అని తన జీతం మొత్తం బ్యాంకులో వేస్తుంది వరం.

సీతాపతి మిత్రుడు, ఆఫీసులో కొలీగ్ అయిన జగన్నాథం ఫారిన్ టేప్ రికార్డర్లు, రేడియోలు, స్టీరియోలు ఎలా సంపాదిస్తాడో గానీ, అప్పుడప్పుడు ఆఫీసుకి తెచ్చి అమ్ముతుంటాడు. అతనికి సీతాపతి మనసులో ఉన్న కోరిక తెలుసు. అతని భార్యకీ మధ్య ఉద్యోగం వచ్చిన విషయమూ తెలుసు.

జపాన్ మేడ్ టేప్ రికార్డర్ ఒకటి తెచ్చి చూపించాడు సీతాపతికి.

"ఏం, గురూ, తీసుకుంటావా? ఫస్ట్‌క్లాస్ బ్రాండ్ న్యూ సెట్. బ్రహ్మాండంగా పని చేస్తుంది. ఇదసలు ఇండియాలో దొరకదు. దొరికినా ఖరీదు పదిహేను వందలకి తగ్గదు. చూడు మరి నీ క్కావాలంటే వెయ్యి రూపాయల కిచ్చేస్తాను. బలవంతం ఏం లేదు. ఏదో మనవాడివి కదా అని ముందు నీకే ఆఫర్ చేస్తున్నాను'' అన్నాడు జగన్నాథం.

టేప్ రికార్డర్‌ని పరీక్షగా చూశాడు సీతాపతి. లంచ్ అవర్లో ఒక కాసెట్ ప్లే చేసి వినిపించాడు జగన్నాథం. అంతా ఆటోమాటిక్ ఆరేంజమెంట్. బ్యాటరీ, కరెంటు— దేనితో అయినా పని చేస్తుంది.

"ఏమంటావు?'' అన్నాడు జగన్నాథం.


"బాగుంది కానీ, ఇంట్లో మా మిసెస్‌ని అడిగి రేపు చెబుతాను.''

ఆ మాటలు జగన్నాథాన్ని ఎంత ఆశ్చర్య పరిచాయో చూశాక ఆశ్చర్యపోక తప్పలేదు సీతాపతికి.

"బాగుందయ్యా, స్వామీ! నీ క్కావలసిన వస్తువు కొనుక్కుందుకు మీ మిసెస్ పెర్మిషన్ కావాలా? నువ్వేం మగవాడివయ్యా?''

తల కొట్టేసినట్లయింది సీతాపతికి.

"అదేం లేదోయ్. మా మిసెస్ నా మా టేదీ కాదనదనుకో. ఏమిటో మొదటి నించీ ఏ పని చేయాలన్నా ఇద్దరం కలిసి చర్చించుకోవటం అలవాటు.''



# భూమి గుండ్రంగా ఉంది

వింధ్యవాసిని

"ఓహ! డెమోక్రసీ పద్ధతి అన్న మాట. అయినా నా కెందుకులే—నీకు కావాలో వద్దో రేపు పొద్దున్నే చెప్పెయ్, గురూ!''

అల్లదిగో, అక్కడే మొదలయింది అసలు గొడవ.

సాయంత్రం భార్యతో విషయాన్ని ప్రస్తావించాడు సీతాపతి. "ఇప్పుడెందు కండీ ఆ టేప్ రికార్డర్ కోసం తొందర? వచ్చే ఏడాది చూద్దాం. ఎటు పోయి ఎటు వస్తుందో కొంచెం డబ్బు వెనకేసుకుని ఉంచుకోవాలి. ఉన్నది కదా అని ఖర్చు పెట్టుకోవటం ఎందుకు? అసలు మీకు ఒక విషయం చెప్పనా... మల్లికిప్పుడు అయిదేళ్ళొచ్చాయా? దాని కోసం పిసమెత్తు బంగారం అయినా తీసి వెయ్యలేకపోయాం ఇన్నాళ్ళు. దాని మెడలోకి ఒక చెయినూ, చెవులకి లోలకులు చేయించుదామండీ'' అని వరలక్ష్మి చెప్పేసరికి వస్తున్న కోపాన్ని దిగమింగుకుని మవునంగా ఉండిపోయాడు సీతాపతి.

• • • •

ఉదయం ఆఫీసులో సీతాపతి ముఖాన్ని చూసే అర్థం చేసుకున్నాడు జగన్నాథం, ఏం జరిగి ఉంటుందో. ఇలా భార్యల చేతుల్లో కీలుబొమ్మల్లా నడుచుకునే సీతాపతులంటే జగన్నాథానికి మంట. ఇలాంటి వాళ్ళకి జ్ఞానబోధ చేస్తే పుణ్యం, పురుషార్థం దక్కుతాయన్న నమ్మకం అతనికుంది.

మధ్యాహ్నం కాంటీకు తీసుకెళ్ళి కాఫీ ఇప్పించాడు.

"ఏమయ్యా! మీ మిసెస్ వద్దనేసింది కదూ?'' అడిగాడు.

"అరే—నీకెలా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగాడు సీతాపతి.

చనువుగా సీతాపతి టేబుల్ మీద ఉన్న సిగరెట్ పెట్టె అందుకుని ఒకటి తీసి వెలిగించుకున్నాడు జగన్నాథం.

"అయ్యో, నాకు తెలీక పోవటమేమిటి? ఇలాంటి కేసు లెన్నో చూశా న్లేను." ధీమాగా అంటున్న జగన్నాథం ముఖంలోకి వింతగా చూశాడు సీతాపతి.

'ఇదేదో జబ్బయినట్లు కేసులంటాడేమిటి?' అనుకున్నాడు.

అమాయకుడయిన శిష్య పరమాణువు వంక గురువులా చూశాడు జగన్నాథం సీతాపతి వైపు. పాఠాన్ని ఎలా మొదలుపెడితే బాగుంటుందా అని ఒక్క క్షణం ఆలోచించాడు.

"ఎప్పుడూ నువ్వు డార్క్ కలర్ పేంట్లు, బాటా సాండల్స్ మాత్రమే వేస్తావేం, గురూ?" "లైట్ కలర్స్ త్వరగా మాసిపోతాయని, బాటా శాండల్స్ బాగా మన్నిక వస్తాయనీ..." "అని మీ శ్రీమతి గారి ఆర్డరూ కదూ? నిజంగా చెబుతున్నా చూడు, సీతాపతి. నీ రంగుకీ, పర్సనాలిటీకీ లైట్ కలర్స్ బాగా నప్పుతాయి."

జగన్నాథం మాటల వెనుక ఉన్న అర్థం కొద్దిగా తెలుస్తోంది సీతాపతికి. "ఆఖరికి నువ్వేసుకునే బట్టలయినా మీ ఆవిడ ఇష్టాయిష్టాల ప్రకారమే—చూశావా?" అని ఎత్తి చూపుతున్నాడని అర్థం చేసుకున్నాడు.

"అసలు ఈ పెళ్ళి అనేది ఉంది చూడూ—ఇదొక విష వలయమోయ్. అమాయకులయిన మగవాళ్ళని తమ చేతిలో పెట్టుకుందుకే ఆడవాళ్ళు పెళ్ళి చేసుకునేది. మొదటినుంచీ భార్యని అదుపులో పెట్టుకురావాలి. ఉదాహరణకి—నా భార్య అనిగొప్పలు చెప్పడం కాదు కానీ, నే నెంత చెబితే అంత దానికి. కూర్చోమంటే కూర్చోవాలి— నిలుచోమంటే నిలుచోవాలి. కాస్త కళ్ళెర్రజేస్తే చాలు, వణికిపోతూ పాదాల మీద పడిపోతుంది."

"నిజమా" అన్నాడు సీతాపతి నమ్మలేనట్లుగా. అతని బుర్ర చకచకా పనిచేస్తోంది.

తమ ఇంట్లో సాధారణంగా తను కోపం తెచ్చుకునే సంఘటనలు చాలా తక్కువ. అదయినా ఎప్పుడూ వరం తన కాళ్ళ మీద పడిన గుర్తు లేదు.

"అబద్ధాలు చెప్పేందుకు నాకేం ఖర్మ! ఏదో స్నేహితుడివని నీ బాగు కోరి స్వవిషయాలన్నీ చెపుతున్నా. ఎన్నాళ్ళిలా వెన్నెముకలేని మగాడిలా బతుకుతావు? నా మాట విను, సీతాపతీ. ఇప్పటికయినా మించిపోయిందేం లేదు. కాస్త కఠినంగా ఉండటం నేర్చుకో. ఎక్కువసార్లు కోపగించి అలగటం అలవరుచుకో. అప్పటికీ లాభం లేదు అనుకో. గట్టిగా కేకలు వేసి బెదరగొడ్తే సరి. ఆడదాన్ని చెప్పుకింద తేలులా ఉంచుకోగలిగితేనే ప్రాణానికి సుఖంగా ఉంటుంది. ఏమంటావు?"

'అవు న్నిజమే' అనిపించింది సీతాపతికి. మనసులోనే ఏదో గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఎలాగయినా 'వరం'ని సాధించి డబ్బు బ్యాంకు నుంచి తీసుకురమ్మని చెప్పాలి ఓవర్‌రికార్డర్‌కి అనుకున్నాడు. సీతాపతి మనసులో చిన్న సైజు యుద్ధం మొదలయింది. జగన్నాథం మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి.

మధ్యాహ్నం అంతా ఆఫీసులో ఉన్నాడన్న మాటే గానీ, మనసంతా ఇంట్లోనే ఉంది. ఇంటికి వెళ్ళాక 'వరం'తో ఏమని మాట్లాడాలి, ఆమె ఏమంటే ఎలా సమాధానం చెప్పాలి, తన పవర్ ఏమిటో ఆమెకి ఎలా చెప్పాలి అని ప్లాన్లు, రిహార్సల్సు వేస్తూ కూర్చున్నాడు.

• • • •

సీతాపతి ఇల్లు చేరేసరికి పక్క ఇంట్లో ఆడుకుంటున్న కూతురు మల్లీశ్వరి 'నాన్నా' అంటూ పరిగెత్తుకొచ్చింది. ఆ పిల్ల అంతకి అరగంట క్రితమే స్కూల్‌నించి వచ్చి ఉంటుంది.

సీతాపతికి చిరాకుగా, చిరాకుగా ఉంది. ఎప్పటిలా కూతుర్ని ఎత్తుకోనూలేదు—నవ్వుతూపలకరించనూ లేదు. దుస్తులు మార్చుకుని నీరసంగా మంచం మీద వాలేసరికి, "నాన్నా, ఆకలి— పాలుకావాలి" అని వెంట బడింది మల్లి.

తప్పదనుకుని లేచి పాలు వేడిచేసి, కూతురికి బోర్న్‌విటా కలిపి ఇచ్చి, తను కాఫీ కలుపుకుని తాగాడు.

## మీ సాహితీ సంపద

నిర్వహణ: మంజుశ్రీ

### గత సంచికలో ఇచ్చిన సాహితీ సంపద సమాధానాలు

1. తిరుపతి వేంకట కవుల నుద్దేశించి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసిన విమర్శ గ్రంథం. శ్రీపాద వారి గురువులు వేంకట రామకృష్ణ కవులు సమ్మతించలేదు ఈ విమర్శ ప్రకటించడానికి. అందువల్ల అంతరించి పోయింది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి అనుభవాలూ, జ్ఞాపకాలూనూ చదవండి.
2. నెల్లుట్ల రామకృష్ణామాత్యుడనే ఆధునిక కవి.
3. విశ్వనాథ సత్యనారాయణ కోకిలమ్మ పెళ్ళిని ప్రారంభిస్తూ.
4. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు అనే కవిద్వయం.
5. నంది మల్లయ్య, ఘంట సింగయ్య.
6. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తమ జీవితానుభవాలు వివరించిన గ్రంథం. స్వీయచరిత్ర శ్రేణిలో మేలిమైన కూర్పు.
7. అడివి బాపిరాజు. 1933 వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పోటీని నిర్వహించగా వేయి నడగలతోపాటు బహుమానం పంచుకొన్న నవల.
8. సురవరం ప్రతాపరెడ్డి.
9. తిరుపతి వేంకట కవులు.
10. ముట్నూరి కృష్ణరావు.

## 7

### ప్రశ్నలు

1. మర్రిచెట్టు నీడలోని విశేషాన్ని తెలిపే ఒక ప్రాచీన చాటు ఉంది. ఈ నీడ విశేష మేమిటి?
2. తెలుగు దేశపు లక్ష సామెతలు సేకరించే యజ్ఞాన్ని తలపెట్టి నిర్వహించిన దెవ్వరు?
3. తెలుగులో గొప్ప విద్వాంసుడు తలపెట్టి నిర్వహించిన తెలుగు—తెలుగు నిఘంటువు.
4. చార్మినార్ అనే పేరుతో ఇటీవల ఒక మంచి కథల సంపుటం ప్రచురించిన వా రెవ్వరు?
5. కథా రచయితగా అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన తెలుగు కథకుడు.
6. అనసూర్యుని జీవయాత్ర రచయిత?
7. మాతృ గీతాలు రచించిన కవి?
8. గిడుగు రామమూర్తి పంతులు నిర్వహించిన తెలుగు పత్రిక పేరు?
9. ఆంధ్రప్రభ నవలల పోటీలో మొదటిసారి తెలుగు దేశానికి పరిచయమై తర్వాత చాలా ప్రచారం లోకి వచ్చిన రచయిత్రి ఎవరు?
10. కొందరికి తెలుగు గుణమగు కొందరికి సంస్కృతమ్ము గుణమగు ... నే నందర మెప్పింతు కృతుల నయ్యై యెడలన్" అన్న మహానుభావు డెవరు?

—సమాధానాలు వచ్చే సంచికలో

పాలు తాగేసి మళ్ళీ బయటకు పరిగెత్తి పోయింది మల్లి. 'అదే నయం' అనుకుని మళ్ళీ పడకేశాడు.

నిముషాలు గంటల్లా గడుస్తున్నట్లున్నాయి. "ఎంతకీ రాదేం ఈ 'వరం' "అనుకున్నాడు సీతాపతి చిరాగ్గా.

అవతల వరలక్ష్మి చెప్పుల చప్పుడు వినిపించగానే వారపత్రిక ముఖానికి అడ్డంగా పెట్టుకున్నాడు, సీరియస్‌గా చదివేస్తూ.

"అమ్మా, అమ్మా" అంటూ లోపలి కొచ్చింది మల్లి.

"ఏం తల్లీ, యూనిఫారం అయినా మార్చకుండా ఆడుతున్నావా?" మామూలుగా అయితే తను ఇంటి కొచ్చేసరికి పాపకి డ్రెస్ మార్చి చక్కగా ముస్తాబు చేసి ఉంచుతాడు. 'ఈవేళ ఏమయిందో' అనుకుంటూ పిల్లకి బట్టలు మార్చింది.

మామూలుగా తను రాగానే కాఫీ కాచి పోసిపెట్టే ఫ్లాస్క్ ముందర గదిలో టేబిల్ మీద ఉంటుంది. ఇవతల్నించే వరలక్ష్మి అటు వెళ్ళటం గమనించాడు సీతాపతి. ఫ్లాస్క్ ఖాళీగా ఉండటం చూసి "ఏమండీ, కాఫీ తాగలేదా?" అని అడుగుతూ ఇటు వచ్చింది వరలక్ష్మి.

వెనకాలే వస్తున్న మల్లి, "నాన్న కాఫీ తాగే దమ్మా" అని చెప్పేసింది. "మీరుమాత్రం చేసు కున్నారా?" వరలక్ష్మి మామూలుగానే అడుగుతున్నా తనని నిలదీసినట్లు తోచింది సీతాపతికి.

"అవును—ఏం? రోజూ నీవువచ్చే వేళకి రెడీగా కాఫీ చేసి ఉంచాలా?" కసిగా అన్నాడు.

మాట్లాడకుండా అవతలికి వెళ్ళిపోతున్న వరలక్ష్మి వైపు చూసి 'బాగా అయింది' అనుకున్నాడు సీతాపతి. కాఫీ తాగేసి వచ్చి చీర మార్చుకుంది వరలక్ష్మి.

'నే ఎదురుగా ఉండగానే కావాలనే బట్టలు మార్చుకుంటోంది. ఇదొక ట్రిక్. ఇలాంటి ట్రిక్కుల్లో పడే ఈ స్థితికి వచ్చాను' అనుకుంటూ, బలవంతంగా చూపుల్ని చేతిలో ఉన్న పత్రిక వైపు తిప్పు కున్నాడు.

ముఖం కడిగి కొద్దిగా పౌడరద్ది, బొట్టు దిద్దుకుని వచ్చింది వరలక్ష్మి. "ఏమిటలా ఉన్నారు? ఒంట్లో బాగులేదా?" అంటూ పక్కన కూర్చొని, నుదుటి మీద చెయ్యి వెయ్యబోయింది.

"బాగులేక నా కేమయింది?" అంటూ ఆమె చేతిని తప్పించాడు సీతాపతి. "పోనీ ఆఫీసులో ఏదైనా గొడవ ..."


'అసలు ఆఫీసు గొడవలు, బయటి విషయాలు అన్నీ పూసగుచ్చినట్లు ఇంట్లో చెప్పటం తను చేసిన అలవాటే' అనుకుని, "అబ్బే, ఏం లేదు" అన్నాడు.

"మరి ... ఏమిటో డల్‌గా, చిరాకుగా ఉన్నారు. ఎందుకంటే చెప్పరు." ఇలా ఎప్పుడూ అవలేదు. వరానికి బెంగగా ఉంది.

"ఏం లేదు గానీ, ను వ్వెళ్ళి నీ పని చూసుకో"

అని ఆమెని అక్కణ్ణించి తరిమేశాడు.

మామూలుగా అయితే వరలక్ష్మి వంట చేస్తూంటే, సీతాపతి ఆమెకి సహాయం చేస్తూ, కబుర్లు చెప్పటం అలవాటు. ఒక గంటలో పని



ముగించేసి, ముగ్గురూ కలిసి ఏ పార్కుకో వెళ్ళి కాస్సేపు చల్లగాలి పీల్చి వస్తారు.

ఎప్పుడూ లేని దివాళ సాయంత్రం పూట పడుకోవటం విసుగ్గా ఉంది సీతాపతికి. అలా నాలుగు రోడ్లు చుట్టి వస్తే సరి అనుకుని దుస్తులు మార్చుకుని బయలుదేరాడు.

అన్నానికి ఎసరు పడేసి, కాబేజి తరుగుతూ కూర్చుంది వరలక్ష్మి. ఆమె మనసు మనసులో లేదు. 'ఎందుకిలా చేస్తున్నా రీయన?' అని తెగ ఆలోచిస్తోంది. 'ఇల్లు వదిలింది మొదలు మళ్ళీ ఇంటికి వచ్చే దాకా తను ఏమి చేసిందీ, ఏమి జరిగిందీ అన్నీ ఏకరువు పెట్టకుండా వదలరు మామూలుగా. అలాంటిది ఇవాళేమయింది? చూడబోతే కోపం వచ్చినట్లుంది. కారణం ఏమయి ఉంటుంది? కొంపదీసి కోపమంతా తన మీద కాదు కదా?'

కాబేజీతో పాటు వేలి చివర కోసుకున్నప్పుడు గానీ తెలిసి రాలేదు వరలక్ష్మికి తనెంత అన్యమనస్కంగా ఉన్నదీ. గబగబా తడిగుడ్డ ఒకటి వేలికి చుట్టుకుని కాబేజీ కోయటం ముగించింది. అందులో సెనగపప్పు, పచ్చి టెంకాయ వేసి వండితే భర్తకి ఇష్టం అని గుర్తొచ్చింది. సెనగపప్పు డబ్బా తెచ్చి దగ్గరుంచుకుని, అన్నం వార్చేసింది.

వంట అవగానే కూతుర్ని హోమ్‌వర్క్ చేసేందుకు కూర్చోబెట్టింది. నోట్‌బుక్‌లో సగం పేజీలు ఏవో పిచ్చి గీతలు నిండి ఉన్నాయి. అసలే చిరాకుగా ఉందేమో—పట్టరాని కోపం వచ్చేసింది వరలక్ష్మికి. ఎడాపెడా నాలుగు అంటించేసింది. 'ఓ' అని ఏడుపు మొదలుపెట్టింది మల్లి. అలా ఏడుపుతోనే మొదలయిన హోమ్‌వర్క్ కార్యక్రమం ఇంకా ముగియక ముందే ఇంట్లో అడుగు పెట్టాడు సీతాపతి.

ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్న పసిదాన్ని చూడగానే అతనిలో పితృహృదయం ద్రవించింది.

"దాన్ని ఏడిపించటం తప్ప నీకేం చేతనవును? నే రాయిస్తానులే" అని కసిరాడు భార్యని.

విసురుగా లేచి లోపలికి వెళ్ళిపోయింది వరలక్ష్మి. పరిస్థితి శ్రుతి మించుతూందే—ఏమిటి చేయటం అనుకుంటూ స్టవ్ మీద నూనె పెట్టి నాలుగు వడియాలు వేయించింది.

అప్పటిగ్గానీ గుర్తు రాలేదు వరానికి అసలు సంగతి:

'పాపం! టేప్ రికార్డర్ కొనుక్కోవాలని ఆయన కెన్నాళ్ళనుంచో ఉంది. పాపిష్టి దాన్ని— ఆయనంతగా కోరితే కాదన్నాను. అందుకే వచ్చిందేమో కోపం. పోనీ కొనెయ్యండి అని చెబుతాను' అనుకుంది.

"ఇదిక్కడే నిద్రపోయేలా ఉంది. కాస్త తిని పిస్తావా?" సీతాపతి కేక వినిపించింది. గబగబా పళ్ళెంలో అన్నం, నెయ్యీ, కూరా వేసి కలిపింది.

అప్పుడప్పుడూ కసురుతూ, కేకలు వేస్తూ జగన్నాథం సలహా తూచా తప్పకుండా పాటిస్తున్నానని సంతృప్తి పడ్డాడు సీతాపతి. టేప్ రికార్డర్ సంగతి కూడా చెప్పి, రేపు బ్యాంకు నించి డబ్బు తెమ్మని గదమాయించాలని అనుకున్నాడు.

మౌనంగానే ఇద్దరి భోజనాలు అయ్యాయి. అన్నం మెత్తగా అయినందుకు వరానికి పడిన చీవాట్లు తప్పిస్తే, వంట గది సర్ది ఆమె వచ్చే సరికే తాంబూలం వేసుకున్నాడు సీతాపతి. సున్నం ఎక్కువయింది కాబోలు, నోరంతా చెడ్డ అవస్థ పడ్డాడు.

'ఛీ! ఆఖరికి ఆకులకి సున్నం రాసుకోవటం కూడా చేతకానివాణ్ణి అయ్యాను. అన్నిటికీ ఈ వరం మీద ఆధారపడటమే కారణం' అని తిట్టుకున్నాడు.

ముఖం కడుక్కుని ముస్తాబయి వచ్చింది వరలక్ష్మి. అప్పటికి తన మంచం మీద గోడవైపుకి తిరిగి పడుకుని ఉన్నాడు సీతాపతి. వరలక్ష్మి వచ్చి మంచం మీద కూర్చోవటం, ఆమె రాసుకున్న లావెండర్ డ్యూ పరిమళం తెలుస్తున్నాయి. నడుం మీద చేయి పడటంతో ఇటు తిరిగి, "ఏమిటి?" అన్నాడు సీరియస్‌గా.

"ఏమండీ! ఎందుకండీ అంత కోపం? టేప్ రికార్డర్ వద్దన్నాననేగా! సారీ, రేపు డబ్బు తెచ్చిస్తాను. కొనెయ్యండి."

తల వంచుకుని అంటున్న వరలక్ష్మిని చూసి అవాక్కయాడు. తను అడక్కుండా ఆమె అలా ఆఫర్ చేయటం అతనికి నచ్చలేదు. ఆమె ఏదో దయతలచి ఇస్తానంటే తను తీసుకోవటమా? చ అనుకున్నాడు. అప్పటికప్పుడు మనసులోనే ఏదో నిర్ణయించుకున్నాడు.

"నువ్వు నా కేమీ ఇవ్వక్కర్లేదులే. అసలు నిన్నిలా నెత్తి నెక్కించుకున్న తప్పు నాదే. ఇప్పటి నించీ ఎలా చేయాల్సిందీ నాకు తెలుసు. నీవు, నేను అనే తేడా లేకుండా సేవింగ్స్ అంతా నీ పేర ఉంచటం వల్లనేగా నీ కింత జోరెక్కింది. నా జీతం నుంచీ నెలకి మూడొందలు ఇస్తాను. ఆ పైన అరిచి గీపెట్టినా ఒక్క పైసా ఇవ్వను."

"ఎందుకండీ అలా మాట్లాడతారు? ఇప్పుడు నే నేమన్నానని అంత కఠినంగా మాట్లాడుతున్నారు? మీరేం చెప్పితే అలా చేస్తాను. నన్ను క్షమించరూ?" అంటున్న భార్య కళ్ళ నీళ్ళు చూసి ఎక్కడ కరిగిపోతానో అని మళ్ళీ అటు తిరిగి కళ్ళు మూసుకున్నాడు సీతాపతి.

ఇంకా ఎంత సేపయినా భర్తని బ్రతిమలాడేదో గానీ, కూతురు లేచి కూర్చుని 'అమ్మా' అని ఏడుపు లంకించుకోవటంతో లేచి వెళ్ళి, దాని పక్కన పడుకుంది వరలక్ష్మి. కళ్ళలో నీళ్ళు—మనసులో బాధ ఉంచుకునే అలసటగా నిద్రపోయింది.

సీతాపతికి నిద్ర పట్టలేదు. లేచి గొంతు క్కూర్చుని రెండు సిగరెట్లు తగలేశాడు. పక్క మంచం మీదే నిద్రపోతున్న భార్య దగ్గరికి

తిరిగి ఆమె మీద చెయ్యి వేసుకుని పడుకుంటే తప్ప నిద్ర రాదేమో అనిపించింది. కానీ మొదటి రోజునే మెత్తబడితే, అనుకున్నది సాధించలేడేమో అని అనుమానం.

సాయంత్రం ఒంటరిగా బయటికి వెళ్ళాడేగానీ— ఏం చేయాలో ఎటు వెళ్ళాలో అర్థంకాలేదు. ఇందుక్కారణం, ఇలా రావటం అలవాటు లేక పోవటమే అనిపించింది.

• • • •

ఉదయం సీతాపతికి మెలకువ వచ్చేసరికి బాగా పొద్దెక్కింది. ఇవాళ వరం కాఫీతో మేలుకొలుపు పాడలేదేమా అనుకున్నాడు. మళ్ళీ గుర్తువచ్చింది. 'అలకపాన్పు. పలకరిస్తేగానీ మాట్లాడదేమో!' అనుకుంటూ మంచం దిగాడు.

ముఖం కడుక్కుని ఇవతలి కొచ్చేసరికి టేబుల్ మీద కాఫీ రెడీగా ఉంది. కాఫీతాగేసి గడ్డం గీసుకున్నాడు.

రోజూ అయితే బాయిలర్ అంటించటం, వేడి నీళ్ళు బాత్‌రూమ్‌లోనూ, తాగేందుకూ కావలసినవి నింపి పెట్టటం, కూతురికి స్నానం చేయించటం తన పనులు. ఇప్పటి నించీ ఇంక ఏం చేసేదిలేదు అనుకుంటూ స్నానం చేస్తున్న సీతాపతి, అలవాటు చొప్పున వరం అని పిలవ బోయాడు.

ప్రతీ రోజూ స్నానం చేసేటప్పుడు తను పిలవగానే వచ్చి వరం వీపుకి సబ్బు రుద్దటం, అప్పుడు తను చేసే అల్లరి, ఇంతలో మల్లి ఏం చేస్తున్నా రిద్దరూ? అంటూ వచ్చి వాళ్ళ అమ్మని లాక్కు పోవటం.·. వద్దన్నా గుర్తొస్తున్నాయి సీతాపతికి. ఇంక వరం అని పిలవాలనిపించలేదు. బడాబడా నాలుగు చెంబుల నీళ్ళు గుమ్మరించు కున్నాడు.

"టిఫినేం చేశావ్?" అడిగాడు.

"ఉప్మా."

"ఛత్. ఉప్మా ఎవరు తింటారు. చపాతీలు కుర్మా చెయ్యి."

"కూర్మాకి ఉర్ల గడ్డలు లేవు"

"నిన్న సాయంత్రం ఎందుకు చెప్పలేదు. ఇప్పుడు తెప్పిస్తాను చేసెయ్యి" అంటూ హడావిడిగా డ్రస్ చేసుకుని వెళ్ళి పోయాడు.

వంట అయేసరికి వరలక్ష్మికి బాగా ఆలస్యం అయిపోయింది. భర్త టిఫిన్ బాక్స్ టేబిల్ మీద ఉంచి, భోజనం వడ్డించి, మల్లికి కాస్త తినిపించి వెంట బెట్టుకుని వెళ్ళి పోయింది. కూతుర్ని స్కూల్లో వదిలి ఆమె ఆఫీసుకు వెళ్ళాలి.

ఆలస్యం అయినట్లుంది. భోంచెయ్యకుండానే వెళ్ళి పోయింది పాపం అని జాలిపడ బోయింది సీతాపతి మనసు. అతను దాని నోరునొక్కేసి, 'పోనీ ఒక్క రోజిలా అవుతే, కాస్త జాగ్రత్త పడటం నేర్చుకుంటుంది' అనుకున్నాడు.

కానీ భోజనానికి కూర్చుంటే ఏమిటో ముద్ద మింగుడు పడటమే కష్టమయి పోయింది సీతాపతికి. అన్నం, సాంబారు, కూర, చారు—అన్నీ రుచిగానే ఉన్నాయి మరి. ఆకలిగా లేదు అనుకుని చేయి కడిగేశాడు.

ఆఫీసుకు వెళ్ళగానే ఎదురొచ్చిన జగన్నాథం 'ఏమయింది' అన్నట్లు కళ్ళెగరేశాడు.

"లాభంలేదులే. ఆ టేప్ రికార్డర్ ఇంకెవరి కయినా అమ్మెయ్. నా కిప్పుడొద్దు."

"అదేమిటి? నిన్న నేను చెప్పిన పాఠాలన్నీ ఈ చెవిని విని, ఆ చెవిని వదిలేశావా?"

"అదేంకాదు. మా ఆవిడ తను డబ్బు తెచ్చి ఇస్తానని అంది కానీ, నేనే వద్దన్నాను."

"ఏం?" అడిగాడు జగన్నాథం ఆశ్చర్యంగా.

"అదంతే. అని దేదో దయతలచి నాకు డబ్బివ్వట మేమిటి? ఇప్పటి నించీ నా డబ్బు నా దగ్గిరే ఉంటుంది. నేనే సేవ్ చేసుకుని, ఆమె ప్రమేయం లేకుండా నాకు కావలసినవి కొనుక్కుంటాను."

వీనేదో సొంత లాభం కొంత ఒనగూడుతుందని వీడికి పాఠాలు చెప్పబోతే, అసలుకే మోసం వచ్చేసిందే. ఎక్కడుందీ లోపం అని తెగ బాధ పడిపోయాడు జగన్నాథం.

కానీ, సీతాపతి చివరగా అన్న మాటలు బాగా వచ్చాయి అతనికి. జీతమంతా తీసి భార్య చేతిలో పొయవలసిన అవసరంలేని పుణ్యాత్ముడు తన లాంటి వాడికి దొరికితే ఇక లోటేముంది అనుకున్నాడు జగన్నాథం. అతనికి ఇతర్ల డబ్బుతో కాఫీ, టిఫిన్లు, అప్పుడప్పుడు బ్రాందీ విస్కీలు సేవించటం, సినిమాలకి వెళ్ళటం అంటే పరమ ఇష్టం. ఆ ఆఫీస్‌లో జగన్నాథం జాతి పక్షులింకా ఇద్దరున్నారు. క్షణాల్లో సీతాపతి విషయం వాళ్ళకి తెలిసి పోయింది. రంగనాథమూ, సుబ్బారావు, జగన్నాథం కలిసి సాయంత్రం సీతాపతిని ఇంటిదారి పట్టకుండా ఆటువించి అటే బయటికి లాక్కు వెళ్ళారు.

కొత్తగా తమ గుంపులో చేరిన సీతాపతికి మెల్లిగా అలవాటు అవనీ అని ఆవేళ కాఫీ టిఫిన్లు, రోడ్ల షికార్లు, పార్కు కబుర్లతో వదిలేశారు. సరదాగా గడిచింది ఇవాళ అనుకుంటూ ఇల్లు చేరాడు సీతాపతి.

మల్లి నిద్ర పోతూంది. వరలక్ష్మి కిటికీ దగ్గర కూర్చుని ఎదురు చూస్తూంది.

సీతాపతి ఇంట్లోకి రాగానే, "ఏమండీ ; ఇంత ఆలస్యమయింది. ఏమయిందోనని ఎంత భయపడ్డానో" అంటూ రెండు చేతులు అంది పుచ్చుకున్న వరం బుగ్గల మీద కన్నీటి చారికలు స్పష్టంగా కనిపించాయి సీతాపతికి.

'ఇంత సేపూ ఏడుస్తూ ఉంది కాబోలు. అంతా తన అధికారానికి భంగం కలిగిందనేమో!' అనుకుంటూ భోజనానికి కూర్చున్నాడు.

ఉదయం సరిగా తినక పోవటం, ఇప్పుడు వూరంతా బలాదూరు తిరగటం వల్లనేమో ఆకలి మీదున్నాడు సీతాపతి. తృప్తిగా భోజనం కానిచ్చి పడుకున్నాడు. ఎప్పుడు నిద్ర పట్టిందో గుర్తు లేదు. ఆ రాత్రి వరం చాలాసేపు తన పక్కన తన ముఖంలోకి చూస్తూ, ఆలోచిస్తూ, బాధ పడుతూ కూర్చుని ఉందని సీతాపతికి తెలీదు.

• • • •

వారం రోజులు దాదాపు ఇలానే గడిచాయి.

ఒక రోజు మిత్రులు సీతాపతిని బార్ కి తీసికెళ్ళారు. మొదటి రోజు కొద్దిగా డ్రింక్ రుచి చూడమని బలవంతం చేశారు. అయిష్టంగానే రెండు గుక్కలు తాగేసరికి గొంతులో మంట, కడుపులో తిప్పినట్టు అయి వికారంగా అనిపించింది సీతాపతికి.

"మొదటిసారి అలాగే ఉంటుంది. పరవాలేదు." ధైర్యం చెప్పాడు జగన్నాథం.

"ఏమయినా సరే ఈ డ్రింకుల జోలికి వెళ్ళొద్దు" అని అప్పుడే గట్టిగా నిర్ణయం చేసుకున్నాడు సీతాపతి.

మొదటి రోజు బిల్ రంగనాథం పే చేశాడు.

రెండో రోజు సీతాపతి చేతికి వచ్చింది బిల్. ఇంతా చేస్తే అత నా రోజు తీసుకున్నది ఒక బాటిల్ కంపాకోలానే. ముప్పయి రూపాయలు వదిలేసరికి బాబోయ్ అనుకున్నాడు. మూడో రోజు రానని మొరాయించాడు.

పోనీ పేకాడుకుందాం అని అందరూ కలిసి సుబ్బారావు ఇంటికి బయలు దేరారు. అక్కడే మిత్రులు ముగ్గురు కాస్త విస్కీ పుచ్చుకుని ఆటకి కూర్చున్నారు.

సీతాపతికి చెప్పలేని ఆశ్చర్యంగా ఉంది—ఇలా సంసారుల ఇళ్ళలో చేరి పేకాటలు, తాగుళ్ళు ఏమిటి



అని. రహస్యంగా అడిగాడు సుబ్బారావుని — "మీ ఆవిడేమీ అనదా" అని.

"దాని మొహం—అదేమిటి అనేది?" అన్నాడు సుబ్బారావు హుషారుగా పేక కలుపుతూ. అవతలి గదిలో రేడియో మోగుతూంది. ఏదో హిందీ సినిమా పాట చెవులు పగిలేలా వినిపిస్తూంది. సీతాపతి ఇంట్లో ట్రాన్సిస్టర్‌కి అలా పెద్దగా మోగటం అలవాటు లేక అతని కది వింతగా ఉంది.

అతనికి పేక ఆడటం ఇదే మొదలు. ముందుగా ఎలా ఆడాలో నేర్పారు మిత్రులు. స్టేక్ పది పైసలతో మొదలయి, ఒక్కో ఆటలో జోరు ఎక్కువయి ఒక రూపాయికి పెరిగింది.

బొత్తిగా బుర్ర, ఆలోచన ఉపయోగించాల్సిన అవసరం లేని ఈ ఆట హుషారుగా ఆడుతున్న మిగతా ముగ్గుర్నీ చూస్తే ఆశ్చర్యంగా ఉంది సీతాపతికి. అతనికి కొన్ని గేమ్‌లు ఆడేసరికి మొహం మొత్తేసింది.

ఆట ముగిసి బయట పడేసరికి గంట తొమ్మిదయింది.

గేటు దాటుతూ ఉండగా, రంగనాథం గుసగుసగా, "అటు చూడు" అనటంతో, తల వెనక్కి తిప్పి చూశాడు సీతాపతి. వరండాకి అవతల చిన్న సందులో

